సాక్షి
చిత్తూరు
శనివారం । 13 । జనవరి । 2024



వివేకానంద ఆదర్శం కావాలి

స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 8లో



అన్ని దానాల్లో రక్తదానం మిన్న

అన్ని దానాల్లోకెల్ల రక్తదానం మిన్న అని జిల్లా టీకా అధికారి రవిరాజు అన్నారు. నగరిలో రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. - 8లో



అమరన్నా అబద్ధాలు ఆపండన్నా

అమరన్నా అబద్ధాలు చెప్పడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ నేతలు మాజీ మంత్రి అమరనాథరెడ్డికి సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

జేవీకే కిట్లు భద్రపరచండి



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో ఉన్న జేవీకే (జగనన్న విద్యా కానుక) కిట్లను జాగ్రత్తగా భద్రపరచాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం బాలాజీకాలనీలోని మున్సిపల్ పాఠశాలలో ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రస్తుత విద్యాసంవత్సరంలో సరఫరా చేసిన జేవీకే కిట్లలో విద్యార్థులకు పంపిణీ చేయగా మిగిలిన వాటిని జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ప్రతి కిట్‌కు లెక్క చూపాల్సి ఉంటుందన్నారు. కిట్లు భద్రపరచాల్సిన బాధ్యత ఎంఈఓ-2, హెచ్‌ఎంలదేనని చెప్పారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ మిగిలిన కిట్లను వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలో జేవీకే కిట్ల పంపిణీకి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుతం సరఫరా చేసిన కిట్ల వివరాలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సూచించిన యాప్‌లో ఈ నెల 20 లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సెక్టోరల్ అధికారులు అజయ్‌కుమార్ రెడ్డి, జయప్రకాష్, ఉదయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయం పరిశీలన



జెడ్పీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. శుక్రవారం జెడ్పీలో నిర్వహించిన సమావేశానికి విచ్చేసిన ఆయన జిల్లా పరిషత్ భవనాన్ని పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ భవనం ఎప్పుడు నిర్మించారు.. ప్రస్తుతం ఆ భవన నిర్మాణం పరిస్థితి ఏమిటన్న విషయాలను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 23వ తేదీన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన ఉదయం 10.30 సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీ, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధిపై చర్చ జరుగుతుందన్నారు. ప్రతి ఒక జిల్లాధికారి కచ్చితంగా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

18న వేమన పద్య పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన వేమన పద్య పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలమనేరులోని కళా మందిరంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. అత్యధిక పద్యాలు చెప్పిన 25 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పుస్తక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ద్రవిడ యూనివర్సిటీ వీసీ ఆచార్య మధుజ్యోతి హాజరవుతారని చెప్పారు. వివరాలకు 9553429770 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. జనాభా, ప్రాంతం ఆధారంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత నిధులను విడుదల చేశారు. చిత్తూరు జిల్లాలో 684 పంచాయతీలకు గాను రూ.11,52,29,049, తిరుపతి జిల్లాలోని 745 పంచాయతీలకు రూ.11,27,13,553 నిధులను ఇచ్చారు. ఈ మొత్తాన్ని త్వరలో ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేయనున్నారు. నిబంధనల ప్రకారం పీఎఫ్‌ఎంఎస్, ఈ గ్రామ స్వరాజ్ విధానంలో ఖర్చు చేసి, వినియోగ పత్రాలను అందజేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.



హద్దులు చెరిపేస్తూ..
ఆరోగ్యమందిస్తూ!



గుడిపాల మండలం 189 కొత్తపల్లి లో దివ్యాంగ బాలుడి ఇంటికెళ్లి పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్



189 కొత్తపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా మండలాలు పొరుగురాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు చిన్నజబ్బు చేసినా పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టేవారు. సరైన రవాణా సదుపాయాలు లేక .. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేశారు. గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. 24 గంటలూ వైద్య సేవలందేలా చర్యలు చేపట్టారు. దీనికితోడు నడవలేని దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, గర్భిణులు, ఇతరత్రా వారు పట్టణాలు.. పక్క రాష్ట్రాలకు వెళ్లే బాధలు లేకుండా ఇంటిపట్టునే వైద్యం చేసుకునేలా ఫ్యామిలీ ఫిజీషియన్ పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిపై రోగులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పల్లెకు డాక్టర్లు
- పేద ప్రజలకు స్థానికంగానే వైద్యం
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారికి తగ్గిన ఆర్థిక భారం
- పక్క రాష్ట్రాలకు వెళ్లే వారికి తప్పిన తిప్పలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

సాక్షి, తిరుపతి డెస్క్ : ఇంటి వద్దకే వైద్యం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2022లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టగా.. 2023 మార్చిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈ విధానం అమలులోకి వచ్చింది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను కేంద్రంగా చేసుకుని 104 వాహన సేవలతో కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో డాక్టర్లు, వైద్య సిబ్బందిని పల్లెబాట పట్టించింది. స్థానికంగానే 14 రకాల వైద్యపరీక్షలు, 67 రకాల మందులు, మాత్రలు అందిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ ఆపరేషన్ చేయించుకున్న వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టింది. అంతేకాకుండా తాగునీటి శుభ్రత, అంగన్‌వాడీ సేవలు, పారిశుద్ధ్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. రోజూ ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా చేపట్టే వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచేలా ఆదేశాలు జారీ చేసింది.

నాడు ఇలా...

గత టీడీపీ హయాంలో వైద్యమంటే పేదలకు అందని ద్రాక్షలా ఉండేది. చిన్న జబ్బు చేసినా వైద్యం అందేది కాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళితే మందులు కూడా సక్రమంగా దొరికేవి కావు. డాక్టర్లు ఎప్పుడొస్తారో.. సిబ్బంది ఎంతసేపు విధుల్లో ఉంటారో కూడా తెలిసేది కాదు. విధిలేని పరిస్థితుల్లో పేద రోగులు తీవ్ర వ్యయప్రయాసాలకోర్చి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు. అక్కడ చికిత్స కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోయేవారు. రవాణా ఖర్చులూ తడిసి మోపుడయ్యేవి. జిల్లా సరిహద్దు ప్రాంత వాసులైతే ఇక అంతే. పక్క రాష్ట్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు దేవుడిపై భారమేసి మంచానికే పరిమితమయ్యేవారు.

నేడు ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక వైద్యానికి పెద్ద పీట వేసింది. పేదల ఆస్పత్రులుగా పేరుగాంచిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. రోగులకు కావాల్సినన్ని మందులు, మాత్రలను అందుబాటులో ఉంచింది. డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. గర్భిణులకు సలహాలు, సూచనలతోపాటు ప్రసవాలు పీహెచ్‌సీలోనే జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ప్రధానంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించి డాక్టర్లను పల్లెబాట పట్టించింది. ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో కొత్తపథకానికి పురుడుపోసి పేదల నాడి పట్టింది. ఇంటి పట్టునే వైద్య సేవలు అందిస్తూ మన్ననలు అందుకుంటోంది. వలస జీవులకు, సరిహద్దు ప్రాంతాల్లోని వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. ఫలితంగా ఆర్థిక భారం తగ్గడంతోపాటు ఇంటి వద్దే వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించింది.

ఇంటి వద్దే వైద్యం

ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం పల్లెనాడి పట్టింది. నిర్ణీత సమయంలో డాక్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరుకుంటున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్లినిక్‌లోనే ఉంటూ రోగులకు సేవలందిస్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతరత్రా సమస్యలున్న వారికి ఈ కార్యక్రమం అపరసంజీవినిలా మారింది. ఆర్థిక భారం, రవాణా ఖర్చులు, రోగులకు తోడుగా వచ్చే వ్యక్తి తదితర బాధలు తప్పాయి.

వలస జీవితాలకు ఆరోగ్య భరోసా

ఉమ్మడి చిత్తూరు జిల్లా సరిహద్దుగా ఉన్న తమిళనాడు రాష్ట్రం పక్కనే గుడిపాల, చిత్తూరు రూరల్ మండలం, జీడీ నెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పాల స ముద్రం, నగరి, సత్యవేడు తదితర మండలాలు న్నాయి. ఈ ప్రాంత వాసులు గతంలో వైద్య సేవల కోసం తమిళనాడులోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవారు. ముఖ్యంగా వేలూరులోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉండేది. ఫ్యామిలీ ఫిజీ షియన్ రాకతో ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. పల్లెల్లోనే వారి బాగుగోలను పరీక్షించుకుంటున్నారు. ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు.



189 కొత్తపల్లెలో ఏర్పాటుచేసిన శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మెరుగైన వైద్యం



నేను కొంత కాలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నా. కొన్నాళ్లుగా ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకుంటున్నా. అక్కడ ఇచ్చే మందులు, మాత్రలు నాకు పనిచేయలేదు. తర్వాత ఊరికొచ్చే డాక్టరు వద్ద చూపించా. మందులు, మాత్రలు ఇచ్చారు. అవి తింటున్నా. నాకు ఇప్పుడు ఎలాంటి ఇబ్బందీ లేదు. నాకు ప్రతి నెలా రూ.2 వేల వరకు మిగులుతోంది.

– అశోక్, గుడిపాల మండలం

సలహాలూ ఇస్తున్నారు



గర్భిణిని అని తెలిసిన రోజు నుంచి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రికి వెళ్లకుండా పల్లె డాక్టర్ పరీక్షించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రక్తం తక్కువగా ఉంటే పీహెచ్‌సీకి తీసుకెళ్లి ఐరన్ సుక్రోజ్ పెట్టిస్తున్నారు. బీపీ, షుగర్ చెకప్‌లు రెగ్యులర్‌గా చేస్తున్నారు. మాకు ఎలాంటి సమయం వృథా కావడం లేదు.

– నాగేశ్వరి, గుడిపాల



చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 189 కొత్తపల్లెలో వైద్య సేవలందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ చంద్రమహేష్

ఫ్యామిలీ ఫిజీషియన్ వివరాలు

	చిత్తూరు జిల్లా	తిరుపతి జిల్లా
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	439	434
104 వాహనాలు	34	31
గ్రామాల సందర్శన	495	501
వైద్య పరీక్షలు చేసుకున్న వారు	13,145	18,256
జనరల్ ఓపీ	7,123	8,045
గర్భిణులు	423	1,215
బాలింతలు	425	895
బీపీ	3,712	3,859
మధుమేహం	2,011	2,952

ఇంటికాడే చూస్తున్నారు



డాక్టరు వస్తున్నారని ముందుగానే ఆశ వర్కర్లు వచ్చి చెబుతారు. ప్రతి నెలా వారు చెప్పిన టైమ్‌కి డాక్టర్లు వస్తున్నారు. తెల్లారి నుంచి మధ్యాహ్నం దాకా ఊళ్లోనే ఉంటున్నారు. ఓపిగ్గా చూసి మంచి మందులు, మాత్రలు ఇస్తున్నారు. పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు చెబుతున్నారు. ఇప్పుడు చిన్న రోగం వచ్చినా ఇక్కడే చూపించుకుంటున్నాం.

– రాధ, గుడిపాల మండలం

మందులు ఇస్తున్నారు



నాకు ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు అధికంగా ఉన్నాయి. ఇంకా కొన్ని సమస్యలతో బాధపడుతున్నా. ముందు ఆ ఆస్పత్రి, ఈ ఆస్పత్రి అంటూ తిరిగేదాన్ని. అప్పోసప్పో చేసి ఖర్చు చేసేదాన్ని. ఇప్పుడు ఆ బాధలేదు. ఊరికే డాక్టరు వచ్చి చూస్తున్నారు. నెలకు సరిపడా మందులు, మాత్రలు ఇస్తున్నారు.

– అంజలి, గుడిపాల మండలం

ఊరు వదిలి వెళ్లేది లేదు



ఏ జబ్బుకైనా పల్లెకొచ్చే డాక్టరే చూస్తున్నారు. ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. వారిచ్చే మాత్రలు మింగుతున్నాం. అందుకే కుదురుగా ఉంటున్నాం. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లేది లేదు. ఒక వేళ మాత్రలు లేకున్నా.. క్లినిక్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యంతో అన్నీ బాగున్నాయి.

-జయరాజ్, గుడిపాల

నడిచి వెళ్లేదాన్ని



నాకు విపరీతమైన కాళ్లు నొప్పులు. నడవలేని పరిస్థితి. మూడు కాళ్లతో నడుచుకుంటూ వెళ్లి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేదాన్ని. అక్కడిచ్చే మాత్రలు మింగుతూ వచ్చేదాన్ని. నడిచి వెళ్లాలంటే నరకం కనిపించేది. ఓ సంవత్సరంగా మా ఊరికే డాక్టరు, మందులిచ్చేవాళ్లు వస్తున్నారు. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లేది లేదు. ఇంటి పట్టునే ఈడే చూపించుకుంటున్నా.

– శారద, గుడిపాల

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కసరత్తులో బీఎల్వోలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల ముందస్తు కసరత్తు, పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిబంధనల మేరకు మౌలిక వసతులు పకడ్బందీగా కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను తప్పనిసరిగా సందర్శించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల సందర్శన ఆయా మండలాల తహసీల్దార్లు, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సమగ్రశిక్ష, పంచాయతీరాజ్ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని, పనులను పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా ర్యాంపులను సిద్ధం చేయాలన్నారు. ఈఆర్వో, ఏఈఆర్వోలు, సెక్టోరల్ అధికారులతో సమన్వయం చేసుకుని ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించాలో పకడ్బందీ నివేదికలు తయారు చేయాలని తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ఈ నెల 13వ తేదీ సాయంత్రంలోపు కలెక్టరేట్‌కు నివేదికలు పంపించాలన్నారు. ఈ నెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అభ్యంతరాలను పకడ్బందీగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్‌కుమార్‌రెడ్డి, సుజన, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహుకాల పూజలు

- అభిషేక పూజలకు తరలివచ్చిన భక్తులు
- ఆలయం వద్ద అన్నదానం




ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, భక్తులకు అన్నం వడ్డిస్తున్న చైర్మన్, ఈఓ


చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి ప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువజామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల నడుమ రాహుకాల అభిషేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేయించారు. మహిళలు ఉపవాసదీక్షలతో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉభయదారులకు చైర్మన్, ఈఓ ప్రసాదాలు అందజేశారు.

ఆలయం వద్ద అన్నప్రసాదం వితరణ

బోయకొండ గంగమ్మ ఆలయం అన్నప్రసాద కేంద్రం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో సుమారు వెయ్యిమందికి అన్నప్రసాదం అందజేశారు. అన్నదానానికి దాతలు సహకరించాలని చైర్మన్ కోరారు.

జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ రిశాంత్‌రెడ్డి



ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పండుగ పేరుతో జల్లికట్టు, కోడిపందెలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రిశాంత్‌రెడ్డి హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయం నుంచి ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగను ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాలన్నారు. పండుగ నేపథ్యంలో జల్లికట్టు, కోడిపందెలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. వీటి కట్టడికి అన్ని శాఖల అధికారులను సమన్వయంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక బృందాల ద్వారా నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీలు అప్రమతంగా ఉంటూ పర్యవేక్షించాలన్నారు. కోడి పందెలు నిర్వహించే వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా జల్లికట్టు, కోడిపందేలు జరిగితే 100 లేదా 9440900005 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం అందించిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలో మొత్తం 3,232 సర్వీసులు విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యంపై తిరుపతి ఆపరేషన్ పరిధిలో 94 కేసులు, తిరుపతి రూరల్ 61, పుత్తూరు 87, చిత్తూరు అర్బన్ 75, చిత్తూరు రూరల్ 56, మదనపల్లె 63, పీలేరు 39, పుంగనూరు పరిధిలో 96 కేసులు నమోదు చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ 514 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.11.08 లక్షలు జరిమానా విధించి, నోటీసులు జారీ చేశారు. అలాగే చౌర్యం కేసులు 57కు గాను రూ.53 వేలు జరిమానాతో కలిపి మొత్తం 571 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.11.61 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

18 నుంచి ప్రత్యేక డ్రైవ్

చిత్తూరు కార్పొరేషన్: భవన, ఇతర నిర్మాణ కార్మికుల నమోదుపై ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. శుక్రవారం డ్వామా కార్యాలయంలోని సమావేశ మందిరంలో చిత్తూరు, గుడిపాల, యాదమరి మండలాల వలంటీర్లకు ఈ అంశంపై అవగాహన కల్పించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులకు కార్మికశాఖ ద్వారా అందే సంక్షేమ పథకాలు పొందడానికి ఈ గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయన్నారు. ఏఎల్‌ఓ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

తమిళనాడు బియ్యం పట్టివేత

దొరవారిసత్రం: చెన్నై నుంచి ఆంధ్రకు తరలిస్తున్న తమిళనాడు రాష్ట్ర బియ్యాన్ని విజిలెన్స్, సివిల్‌సప్లై అధికారులు ఉమ్మడిగా దాడిచేసి స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం తల్లంపాడు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సివిల్‌సప్లై డీటీ ఓబయ్య కథనం.. చెన్నై నుంచి ఆంధ్రకు మినీ వ్యాన్‌లో 52 గోను సంచుల్లో 2,550 కిలోల తమిళనాడు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. బియ్యం విలువ రూ.76,500 ఉంటుందన్నారు. ఈ దాడుల్లో వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి


స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ షణ్మోహన్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్ అతిథిగా పాల్గొన్న స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత పాజిటీవ్‌గా ఆలోచించాలని తెలిపారు. అప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలుగుతారని చెప్పారు. ప్రతి ఏటా జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా నెహ్రూ యువజన కేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద మార్గంలో పయనించాలన్నారు. యువత 25 ఏళ్ల లోపు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని చెప్పారు. అనంతరం స్వామి వివేకానంద జీవిత చరిత్రపై వ్యాసరచన, వ్యక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటి గెలుపొందిన విద్యార్థులకు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలకు జ్ఞాపిక, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఏఓ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్యాలెండర్ ఆవిష్కరణ


ఆర్టీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి, ఓస్వ కమిటీ నేతలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఆఫీస్ క్యాలెండర్ ఉందని డీపీటీవో చెంగల్‌రెడ్డి కితాబిచ్చారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఆఫీస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓస్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కేహెచ్‌రెడ్డి, సీసీఎస్ డెలిగేట్ ఈశ్వర్‌రెడ్డి, ఎన్‌వీ బాబు హాజరయ్యారు.

మార్కెట్‌లోకి ఎంజీ ఆస్టర్ నూతన కారు


కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై - బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెశ్విన్ ఆటో మోటార్స్ షోరూంలో శుక్రవారం ఎంజీ ఆస్టర్-2024 కారును షోరూం అధినేత ఉదయ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కారును తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లోని తమ బ్రాంచీల్లో ఒకేసారి మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. వాహనం ప్రారంభ ధర రూ.9.98 లక్షలని తెలిపారు. ఇందులో ఏడీఎస్‌ఎస్-ఎల్-2, 49 సేఫ్టీ, అతిపెద్ద సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కారు కొనుగోలుపై గోల్డ్ కాయిన్, రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా, యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ


మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. చట్టప్రకారం లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తహసీల్దార్లు నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. అసైన్డ్ భూమికి అనుకుని వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు కేటాయించి ఉంటే వివరాలను నివేదికల్లో పొందుపర్చాలని తహసీల్దార్లను ఆదేశించారు. అసైన్డ్ చేసి 20 ఏళ్లు పూర్తయిన వాటిని 22ఏ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. జలవనరులు, పోరంబోకు, రస్తా భూముల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వీఆర్వోలు ప్రత్యేక చొరవతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వెరిఫికేషన్ చేస్తామన్నారు. ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జేసీ తెలిపారు.

అన్నిదానాల్లో రక్తదానం మిన్న

- శిబిరాన్ని పరిశీలించిన డీఐఓ, ఆర్డీఓ

నగరి : అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సామాజిక సంకల్పం పేరిట నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నగరి, కుప్పం, పలమనేరులో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చాలా గొప్పదన్నారు. వలంటీర్లు పలువురిని ప్రోత్సహించడం, వారే ముందుకు వచ్చి రక్తదానం చేయడంతో శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ప్రతి యువకుడు, యువతి రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. మందులు మెడికల్ షాపులో దొరుగుతాయని, కొని వేసుకోవచ్చని, రక్తం అలాకాదన్నారు. అది ఒక మనిషి నుంచి తీసుకోవాల్సిందే అన్నారు. ఆర్డీఓ సుజన మాట్లాడుతూ మనం ఇచ్చే రక్తం ఒకొకరి ప్రాణాన్ని కాపాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంజుల, ఆర్‌ఐ మేఘవర్ణం, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరన్నా అబద్ధాలు ఆపండన్నా!

- మీరు ఓడితే బెంగళూరు, గెలిస్తే విజయవాడలో..
- మా పంచాయతీలో అభివృద్ధే లేదని అబద్ధాలు చెబితే ఎలా?
- జీడిమాకులపల్లె పంచాయతీలోనే రూ.14.50 కోట్ల అభివృద్ధి
- మాజీమంత్రి అమర్‌పై జీడిమాకులపల్లె వైఎస్సార్‌సీపీ నేతలు ఫైర్

పలమనేరు/ గంగవరం: 'ఎన్నికలొస్తే గ్రామాల్లోకి రావడం.. అబద్ధాలను చెప్పడం ఆపై గెలిస్తే విజయవాడలో.. ఓడితే బెంగళూరులో ఉండే మీరు మా పంచాయతీలో అభివృద్ధి లేదనే మాట వెనక్కి తీసుకోవాలి.' అని గంగవరం మండలం జీడిమాకులపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఆ పంచాయతీ వైస్ సర్పంచ్ వాసుదేవరెడ్డి, నాయకులు రెడ్డెప్ప, శివారెడ్డి మాట్లాడుతూ గతంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచి, మళ్లీ మంత్రి పదవి కోసం టీడీపీలోకి వెళ్లినట్టు తామంతా పార్టీలు మారలేమన్నారు. అప్పుడేమో వైఎస్సార్‌సీపీ, ఇప్పుడేమో టీడీపీ, జనసేనలతో మూడుముక్కలాడుతున్నది తమరేనన్నారు. ఎక్కడ పరువుపోతుందోనని, మీ కారు డ్రైవర్ తండ్రి కర్ణాటక మద్యం కేసులో పట్టుబడితే జామీనిచ్చింది తామేనని గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రభుత్వంలో తమ పంచాయతీలో అభివృద్ధే లేదని చెప్పడం సరికాదన్నారు. ఈ నాలుగన్నరేళ్లలో తమ పంచాయతీలో వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.14.50 కోట్లు వెచ్చించారన్నారు. ఈ వివరాలు తమ సచివాలయబోర్డుపై ఉన్నాయని, ఏదేనా అనుమానం ఉంటే చూసుకోవచ్చనన్నారు. నాటి టీడీపీలోలాగా 4 ట్రాక్టర్ల నీరు తోలి 40 ట్రాక్టర్లకు బిల్లులు తాము పెట్టుకోలేదన్నారు. మీ హయాంలో ఇక్కడ మూడు పక్కా ఇళ్లను మంజూరు చేస్తే జగనన్న పాలనలో 42 ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఓట్ల కోసం వచ్చి తప్పులు చెప్పి, జనం మధ్య గొడవలు పెట్టకుండా మీరు గెలిస్తే ప్రజలకు ఏమి మేలు చేస్తారో చెబితే చాలా సంతోషిస్తామని విన్నవించారు.

కండలేరు జలాల విడుదల

రాపూరు: నెల్లూరు, తిరుపతి జిల్లాలకు కండలేరు జలాలను విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్ఈ హరినారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, కండలేరు జలాశయం హెడ్‌రెగ్యులేటర్ సత్యసాయిగంగ కాలువ నుంచి శుక్రవారం నెల్లూరు, తిరుపతి జిల్లాలకు తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. మొదటగా హెడ్‌రెగ్యులేటర్ మూడో వెంట్ ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు జలాశయంలో 12 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, రాపూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రజల నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సాగు నీటికి వినియోగించరాదని ఆయన సూచించారు.

సారా స్వాధీనం


సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

గుడిపాల: ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు చేసి, గుడిపాల మండలం చీలాపల్లె వద్ద శుక్రవారం చిత్తూరు మండలం నరిగిపల్లెకు చెందిన సుకుమార్(55) అనే వ్యక్తి ఐదు లీటర్ల సారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అలాగే చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని సియోన్‌మల్లై వద్ద ఎలక్షన్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పీవై 01 సీఏ 1800 నంబర్ ఇన్నోవాలో తమిళనాడు నుంచి బొమ్మసముద్రం గ్రామానికి వస్తున్న కారులో 24 బీర్ బాటిళ్లు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తమిళనాడు రాష్ట్రం వాలాజా తాలుకాకు చెందిన ప్రశాంత్‌శేఖర్(30), గుడిపాల మండలం తమ్మాపల్లె దళితవాడకు చెందిన దీపక్‌రాజ్(31) అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేణిగుంట- నంద్యాల రైలు ప్రారంభం


జెండా ఊపి రేణిగుంట - నంద్యాల రైలును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

రేణిగుంట : రేణిగుంట-నంద్యాల ప్రత్యేక రైలు సర్వీసును శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట రైల్వే జంక్షన్‌లో గుంతకల్ ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ ప్రారంభించారు. నంద్యాల- కడప వరకు నడుస్తున్న డెమో రైల్వే సర్వీసును రేణిగుంట వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో రాష్ట్రంలో మూడు నూతన రైలు సర్వీసులను ప్రారంభించారు. అందులో భాగంగా రేణిగంట నుంచి ఏడీఆర్‌ఎం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అభ్యర్థన మేరకు స్థానికుల సౌకర్యార్థం నంద్యాల నుంచి కడప వరకు పరిమితమైన రైలు సర్వీసును రేణిగుంట వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ రైలు ప్రతిరోజూ మధ్యాహ్నం 3.45 గంటలకు రేణిగుంట నుంచి బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన డీఆర్‌వో సభ్యుడు మురళీకృష్ణ ప్రయాణికుల సౌకర్యార్థం వీల్‌చైర్లు, టీషర్టులు, రగ్గులు పంపిణీ చేశారు.

650 మందికి మళ్లీ ఉద్యోగాలు హర్షణీయం

తిరుపతి అర్బన్ : క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. రోడ్డు ప్రమాదాలతోపాటు క్రమశిక్షణా చర్యల కింద రాష్ట్రంలో రెండేళ్లలో 650 మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు పేర్కొన్నారు. వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు శుక్రవా రం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇకపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల నుంచి అప్పీల్‌ను స్వీకరించే అధికారం ఆయా డిపో మేనేజర్లకు ఇచ్చారని తెలిపారు. డిప్యూటీ సీటీఎంలు లేదా డీపీటీఓ స్థా యి అధికారులు అక్కడికక్కడే విచారణ జరిపి వా రికి తిరిగి ఉద్యోగాలు ఇచ్చే అధికారాన్ని కల్పించ డం అభినందనీయమన్నారు. గతంలో క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన అన్ని సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించాల్సి రావడంతో జాప్యం జరిగేదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీ ద్వారక తిరుమలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'కు 33 వినతులు


పిచ్చాటూరులో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అధికారులు

పిచ్చాటూరు: పిచ్చాటూరులో శుక్రవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమానికి 33 అర్జీలు వచ్చినట్టు జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు కె.విష్ణుప్రియ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని, రామగిరి బస్టాండు నుంచి శ్రీవాలీశ్వర స్వామి ఆలయం వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును పునర్నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్‌బీ పేటలో మిగులు భూములను పేదలకు పంచాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, వ్యవసాయ శాఖ డీఏఓ ప్రసాద రావు, ఏడీ సుబ్రమణ్యం, ఏఓ సంజీవయ్య, ఎంఈఓలు హేమమాలినీ, యుగంధర్ రాజు, ఏపీఎం వనిత, ఉపాధి ఏపీఓ నాగభూషణమ్మ, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ సతీష్, ఎంపీటీసీ శోభన్ బాబు, వేలు పాల్గొన్నారు.

హాకీ చాంపియన్ తిరుపతి

- రన్నర్స్‌గా వైఎస్సార్ కడప
- ముగిసిన 14వ హాకీ ఏపీ జూనియర్ మెన్ పోటీలు


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న హాకీ సమాఖ్య ప్రతినిధులు

తిరుపతి రూరల్: తిరుపతి వేదికగా మూడు రోజులు సాగిన 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మెన్ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఎస్వీయూ క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తిరుపతి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. 2-1 తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన హాకీ జట్ల మధ్య పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు నిలవగా, అన్నమయ్య జిల్లా జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలుగా నిలిచిన తిరుపతి జిల్లా జట్టు సంబరాల్లో మునిగి తేలింది. విజేతలకు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్, చిల్లీస్ హోటల్ ప్రతినిధి రాజా బహుమతులు అందజేశారు. హాకీ పోటీలు సజావుగా సాగేందుకు రూ.50 వేలు అందజేయడంతో పాటు సహకారం అందించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకారం అందించిన ఫ్రీడమ్ ఫ్రమ్ హంగర్ సంస్థ ప్రతినిధులు, చిల్లీస్ హోటల్ సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, డీఎస్‌డీఓ సయ్యద్ బాషా, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి, చిల్లీస్ హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.